క్లుప్తంగా

రేషన్ పక్కదారి పట్టిస్తే చర్యలు



రేషన్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం: పౌరసరఫరాల ద్వారా బీపీఎల్ కార్డు దారులకు అందిస్తున్న రేషన్ సరుకులు పక్కదారి మళ్లించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. పందిళ్లపల్లిలో రేషన్ షాపును మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులో రికార్డులు పరిశీలించగా ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం, మూడు పంచదార ప్యాకెట్‌లు తేడాలు గుర్తించామని తెలిపారు.

నేడు సామూహిక సాగర హారతి

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఒడ్డున బుధవారం సాయంత్రం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ప్రతినిధి తాడివలస దేవరాజ్ తెలిపారు. వాడరేవు తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించే సామూహిక సాగర హారతిలో భాగంగా స్ఫటిక శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజనలు మంత్ర పుష్పం, సాగర హారతి నిర్వహిస్తున్నామని తెలిపారు. పౌర్ణమి సాగర హారతి కార్యక్రమానికి నియోజకవర్గంలోని భక్తులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని దేవరాజ్ సూచించారు.

ఘంటసాల గాత్రం తెలుగు హృదయాల్లో పదిలం

చీరాల అర్బన్: ఘంటసాల గాత్రం తెలుగు ప్రజల హృదయాల్లో పదిలంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల అమర గాయకులని, ఎల్లప్పుడూ తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటారన్నారు. ఘంటసాల అంటే కేవలం పాటలే కాదని ఉన్నత విలువలతో కూడిన సంగీతాన్ని మనకు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గజవల్లి శ్రీనివాసరావు, కోటా వెంకటేశ్వరరెడ్డి, అచ్యుతుని బాబూరావు, ఎస్‌కే అజాద్, కోండ్రు రత్నబాబు, శ్రీను, మంగపతి, నాగిరెడ్డి, అప్పన్న, ఎస్.కాళిదాసు, పి.డేవిడ్ ప్రసాద్, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు ఘంటసాల స్మారక సమితి వ్యవస్థాపకుడు ఓరుగంటి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ఘంటసాల 51 వ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. చిత్రపటానికి ఓరుగంటి దుర్గ జ్యోతి ప్రజ్వలన చేయగా కరి చంద్రమౌళి నివాళులర్పించారు. సత్యనారాయణ శాస్త్రి, తమ్మన బ్రహ్మానందం, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాదికి నివాళి

చీరాల రూరల్: సుదీర్ఘకాలం పాటు చీరాల కోర్టులో విధులు నిర్వర్తించిన సీనియర్ న్యాయవాది కొణికి నాగభూషణం మృతి బాధాకరమని న్యాయమూర్తులు, న్యాయవాదులు పేర్కొన్నారు. అనారోగ్య కారణంతో రెండు రోజులు క్రితం వేటపాలెంలోని ఆయన స్వగృహంలో సీనియర్ న్యాయవాది నాగభూషణం మృతి చెందారు. మంగళవారం చీరాల కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆయన న్యాయవాద వృత్తికి చేసిన సేవలను గుర్తు చేసుకుని సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్. రెహన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



గ్రామ శివారుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



పూనూరు, చింతగుంటపాలెం మధ్య చిల్లచెట్లతో మూసుకుపోయిన సాగర్‌కాలువ



యద్దనపూడిలో నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రం

ఎక్కడి సమస్యలు అక్కడే!

- మొక్కుబడిగా సర్వసభ్య సమావేశాలు
- మమ అనిపిస్తున్న సభ్యులు, అధికారులు
- మౌలిక సదుపాయాల గురించి పట్టించుకొనేవారేరీ..
- నేడు యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం

యద్దనపూడి: సమస్యల పరిష్కారానికి వేదిక అయిన మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశంలో ప్రజా సమస్యల గురించి పట్టించుకొనే వారు కానరావడంలేదు. యద్దనపూడిలో సమావేశాల్లో సభ్యులు ప్రశ్నించరు.. అధికారులు పట్టించుకోరు అన్న చందంగా మారింది. వచ్చామా... వెళ్లామా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా అధికారులు ప్రగతి నివేదికలు చదవటం, సభ్యులు వినడంతోనే సరిపోతోంది. మరికొందరు అధికారులైతే వారు హాజరుకాకుండా కిందిస్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపుతున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడిక్కడ అపరిష్కృతంగా మిగిలిపోయాయి. బుధవారం జరగనున్న మండల సమావేశంలోనైనా సభ్యులు సమస్యలపై స్పందిస్తారని కొన్నైనా పరిష్కారమవ్వకపోతాయా అన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

సమస్యలు మెండు

మండలంలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశామని అధికారులు, పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ నేటికీ ఏ గ్రామంలో కూడా అవి వినియోగించని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను గ్రామ శివారుల్లో రోడ్లవెంబడి పడవేయటంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి.



జాగర్లమూడిలో అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం



పూనూరులో శిథిలావస్థలో పశువైద్యశాల

- 14 గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చాలా చోట్ల మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దోమలు విజృంభిస్తున్నా ఎక్కడా ఫ్యాగింగ్ కానీ ఎబేట్ పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా ఏ గ్రామాల్లో కూడా స్వచ్ఛత, పరిశుభ్రత అనేవి అదృశ్యమయ్యాయి.
- మండలంలో అంగన్‌వాడీ సెంటర్లు 39 ఉండగా సొంతభవనాలు 4 మాత్రమే ఉన్నాయి. మిగతావన్నీ అద్దె భవనాల్లో, కమ్యూనిటీ హాళ్లలో కొనసాగుతున్నాయి. మరికొన్ని భవన నిర్మాణాలు చేపట్టి అర్థాంతరంగా ఆపివేశారు.
- పోలూరు, యద్దనపూడి, వింజనంపాడు గ్రామాల వద్ద ఉన్న వాగులపై బ్రిడ్జిలు నిర్మించకపోవటంతో వర్షాకాలంలో వాగులు పొర్లి ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినా సైడ్ డ్రైన్లు నిర్మించకపోవటంతో ఇబ్బందులు తప్పడంలేదు.
- అలాగే పూనూరులో పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకొని ఏ క్షణాన కూలుతుందో అర్థంకాక సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.
- యద్దనపూడిలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద బహిరంగ మరుగుదొడ్లు లేక కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- గ్రామాల్లో విచ్చలవిడిగా పందుల సంచారం, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.
- నూతలపాడు మైనర్ కాలువైన సాగర్ కాలువలో పిచ్చిచెట్లు, రబ్బరుకాడలు మెలిచి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. కాలువకట్లపై ముళ్లచెట్లు పెరిగి రాకపోకలకు రైతులు తీవ్ర ఆటంకంగా మారింది. అక్కడక్కడా డ్రాపుల వద్ద రైలింగ్ వాల్స్ పడిపోయాయి.
- గ్రామాల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. బల్బులు మాడిపోతే నెలలు తరపడి వాటిని మార్చే నాథుడే లేక చాలా కాలనీలు అంధకారంలోనే మగ్గుతున్నాయి.
- పూనూరు-పర్చూరు, పూనూరు-మార్టూరు గ్రామాలకు, వింజనంపాడు నుంచి చిలకలూరిపేటకు, యద్దనపూడి, పర్చూరు వెళ్లేందుకు బస్సు సౌకర్యాలు లేవు. అలాగే పోలూరుకు కూడా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. చాలా గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేయని పరిస్థితి నెలకొంది.

క్రీస్తు జననం లోకానికి రక్ష

కారంచేడు: లోకరక్షణకే ప్రభువైన ఏసుక్రీస్తు ఈ లోకంలో కన్య (లూర్థుమాత) గర్భమున జన్మించారని నెల్లూరు కోఏడ్జస్టర్ బిషప్ డాక్టర్ పిల్లి ఆంథోనీదాస్ అన్నారు. మండల కేంద్రమైన కారంచేడు అంబేడ్కర్ కాలనీ సమీపంలో నెలవైన లూర్థుమాత దేవాలయ ఉత్సవ తిరునాళ్ళు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 9వ తేదీ నుంచి విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాల మాదిరిగానే ఈ ప్రాంతంలో కారంచేడులో మరియమ్మకు సమష్టి దివ్యబలిపూజలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. నిర్వహించిన ఉత్సవ తిరునాళ్ళకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన అనేక ప్రాంతాల చర్చిల ఫాదర్లు ఈ ప్రత్యేక ప్రార్థనలకు హాజరై దైవ సందేశాన్ని అందించారు. అర్ధరాత్రి వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన నెల్లూరు పీఠాధిపతులు రెవరెండ్ ఫాదర్ ఆంథోనీదాస్ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఆలయంతో పాటు, చుట్టు పక్కల మరియ మాత ఉత్సవ విగ్రహాలకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక చర్చి ఫాదర్ విజయ్‌సందీప్ రెడ్డి, ఫాదర్ దేవదాసు, ఫాదర్ ఇన్నారెడ్డి, ఫాదర్ జోషి, ఫాదర్ అనీల్ బొల్లంకొండ, ఫాదర్ ఫ్రాన్సిస్, ఫాదర్ వేళాంగిణి, ఫాదర్ జోసఫ్ రెడ్డి, ఫాదర్ జగన్ అనేక ప్రాంతాలకు చెందిన సిస్టర్స్, క్రైస్తవులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక దైవ సందేశం ఇస్తున్న రెవరెండ్ ఫాదర్ ఆంథోనీ దాస్

పౌష్టికాహారం.. యోగాతో సుఖప్రసవం



యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బల్లికురవ: గర్భిణులు సుఖప్రసవానికి పుట్టేబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారంతో పాటు యోగా చేయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహ్మద్, జి. రవితేజ కోరారు. మంగళవారం పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏలో భాగంగా గర్భిణులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. యోగాపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మాతృవందనంలో మొదటి రెండో కాన్పునకు.. ఒక్కో కాన్పునకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుందని ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేయించుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

వేటపాలెం: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్‌లు ధరించాలని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో హెల్మెట్, సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు పోతూనే ఉన్నాయన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చేంత వరకూ ప్రమాదాలను నివారించటం కష్టతరం. ప్రతి ద్విచక్ర వాహనచోదకుడు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఇంటి పెద్ద మృతి చెందితే ఆ కుటుంబాలు వీధిన పడాల్సివస్తుందన్నారు. తల్లిదండ్రులు సెల్‌ఫోన్ వాడే సమయంలో తెలియని లింక్‌లను టచ్ చేయవద్దన్నారు. అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీలు చెప్పాలని అడిగితే స్పందించకూడదన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఉత్తమ అధికారులకు సత్కారం



అధికారులను సన్మానిస్తున్న ఏపీ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు

అద్దంకి రూరల్: రిపబ్లిక్‌డే సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా పురస్కారాలు అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ పీకే సురేష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు (శంకర్),సర్వేయర్ హనుమంతరావును మంగళవారం ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఏఎస్‌వో అమర్‌నాథ్, జ్యోతి రమేష్‌బాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

అద్దంకి రూరల్: విద్యార్థులు చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని అద్దంకి సీఐ సుబ్బరాజు అన్నారు. మంగళవారం స్థానిక రాయల్ కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

గుండెపోటుకు ఇంజెక్షన్

అద్దంకి రూరల్: గుండెపోటుకు గురైనవారికి ఉపశమనం కోసం ఇచ్చే ఇంజక్షన్ అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారి డి. శరత్‌కుమార మంగళవారం తెలిపారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయండి

బల్లికురవ: రేషన్ దుకాణాల నుంచి కార్డు దారులకు ప్రతి నెల అందించాల్సిన సరుకులను సక్రమంగా అందించాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. మంగళవారం సాయంత్రం కొప్పెరపాలెం రేషన్ దుకాణ సరుకు నిల్వలను తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చీరాల అర్బన్: రక్తదానం చేయడం వలన ప్రాణాలను కాపాడవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం చీరాల ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చీరాల డీఎస్ఆర్ హ్యాండ్‌లూమ్స్ అధినేత దామర్ల బాపయ్య పండ్ల రసాలను అందించారు. అసిస్టెంట్ మేనేజర్ డి.కుమారి, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.ప్రకాష్‌రెడ్డి, పి.దయాబాబు, మెట్టు రవిబాబు, ఎంఎస్ రావు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీ

చీరాల అర్బన్: మండల చీరాల డి2 సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ సిబ్బంది 34 బృందాలుగా డి2 సెక్షన్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. అధిక మొత్తంలో విద్యుత్ వాడకం, అక్రమంగా విద్యుత్ వాడకాన్ని గుర్తించారు. మొత్తం 2685 సర్వీసులను తనిఖీ చేయగా 151 మందికి రూ.7.10లక్షలు అపరాధ రుసుమును విధించారు.

విద్యుత్‌ను అక్రమంగా వినియోగించడం నేరమని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని చీరాల డివిజన్ ఈఈ కె.జాన్ థామస్ అన్నారు. విజిలెన్స్ విభాగం డిప్యూటీ ఈఈ మల్లికార్జునరావు, ఆపరేషన్ డిప్యూటీ ఈఈ బి.హరిప్రసాదరావు, వేటపాలెం, పర్చూరు డీఈఈలు పి.శ్రీనివాసులు, రమేష్, ఏఈలు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఈఈ జాన్ థామస్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



యద్దనపూడి: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మేరమ్మ



ఇడుపులపాడులో అధికారులు, రైతులు



స్వర్ణపాలెంలోలో మాట్లాడుతున్న ఏఓ సుధీర్‌బాబు



పెదగంజాంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు

యద్దనపూడి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధానాలపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారి మేరమ్మ అన్నారు. మంగళవారం అనంతవరం, సూరవరపుపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుగుర్తింపు కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో రైతుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వ్యవసాయశాఖ ప్రారంభించిందన్నారు. ప్రతి రైతు ఏపీఆర్ఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన కార్డును అందజేస్తామన్నారు. ఈ గుర్తింపుకార్డుల ద్వారా వాతావరణమార్పులపై సమాచారంతో పాటు వ్యవసాయ పథకాలు, పంట నష్టం బీమా పరిహారం పొందేందుకు ఈ గుర్తింపుకార్డు ఉపయోగపడుతుందని వివరించారు. వీఏఏ ఆర్. మధుప్రియ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): రైతు గుర్తింపు కార్డులు పొంది ఉన్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందిస్తామని మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలియజేశారు. ఇడుపులపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం ఉన్న ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే 11 అంకెల విశిష్ట నంబర్ ఇస్తారన్నారు.

కారంచేడు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో సాగు చేసిన శనగ పంటలో పూత రాలిపోతున్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. మంగళవారం స్వర్ణపాలెం, దగ్గుబాడు గ్రామాల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. రైతు గుర్తింపు కార్డుల కోసం అర్జీలు పెట్టుకోవాలన్నారు.

చినగంజాం: పంట వేసే ప్రతి రైతుకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు అన్నారు. మండలంలోని పెదగంజాం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు మాట్లాడుతూ గ్రామంలో పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు.. ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవను పొందడానికి సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని తెలిపారు. ఎంపీటీసీ యల్లావుల తిరుపతిరావు, వీఏఏ మోబీన్, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): తెగుళ్ళ నివారణకు రైతులు తప్పనిసరిగా నివారణ మందులు వాడాలని మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి అన్నారు. నూతలపాడు, పోతుకట్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగ పంటలో వచ్చే ఎండుతెగులు, వేరు కుళ్ళు తెగులు, తుప్పుతెగులు గురించి రైతులకు వివరించారు.


జె.పంగులూరు: ప్రతి రైతుకు ఐడీ నంబర్ ఇస్తున్నట్లు, నెంబర్ నిమిత్తం దగ్గర లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నూజిళ్ళపల్లి, చందలూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు గుర్తింపు నెంబర్ కోసం తప్పనిసరిగా ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. చందలూరు సర్పంచ్ కృష్ణారావు, గొట్టిపాటి కాజా, సురేష్, ఆర్ఎస్‌కే అధికారి లక్ష్మీప్రియ, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: వేసవి ఎండలు ఆరంభమైనందున పండ్ల తోటలు నీటియాజమాన్య పద్ధతులతో రక్షించుకోవాలని మార్టూరు ఉద్యానాధికారి బి. హనుమంతునాయక్ సూచించారు. మంగళవారం ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాల్లో అరటి, మిర్చి బొప్పాయి, తోటలను ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కన్సల్‌టెంట్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

చీరాల రూరల్: సొంత భూమి కలిగిన ప్రతిరైతు విధిగా గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి అగ్రిస్టాక్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, తద్వారా అన్ని ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్, క్రాఫ్ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి వాటిని పొందుకుంటారని వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం చీరాల నగర్, కొత్తపాలెం గ్రామాల్లో నిర్వహించారు. వీఏఏలు లావణ్య, ధీరజ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ప్రతి రైతు భూమి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకట్కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం,మోదేపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి ఎస్. దీప్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గారావు, వ్యవసాయవిస్తరణాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మేదరమెట్ల: రైతులంతా ప్రభుత్వం కొత్తగా ఇచ్చే గుర్తింపు కార్డులు పొందాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు, బొల్లవరప్పాడు గ్రామాల్లో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు.




రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి



చందలూరులో పొలం పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారి



ఉప్పుమాగులూరులో అరటి తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ



చీరాలలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుమతి

అంకితభావంతో పని చేయాలి

చీరాల టౌన్: పరిపాలన, ప్రజలకు పథకాలను చేరువగా అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండలంలోని దేవాంగపురి, గాంధీనగర్, సాల్మన్‌సెంటర్, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, మొబైల్ యాప్‌డేటా, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, విధుల్లో అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేసి ప్రభుత్వ సేవలందించాలన్నారు. కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లున్నారు.